క్లుప్తంగా

గంజాయి సాగుచేస్తే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న సీఐ సాయినాథ్

తాంసి: గంజాయి సాగు చేసినా.. రవాణా చేసినా.. కఠిన చర్యలు తప్పవని జైనథ్ సీఐ డి.సాయినాథ్ హెచ్చరించారు. శనివారం భీంపూర్ మండలంలోని బెల్సరీరాంపూర్ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలను వివరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి సాగు నిర్మూలన ధ్యేయంగా పోలీస్‌శాఖ తరఫున చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో భీంపూర్ ఎస్సై కలీమ్, మాజీ సర్పంచ్ శంకర్, గ్రామ పెద్ద సంతోష్, సిబ్బంది ఉన్నారు.

భగీరథ పైపులైన్ లీక్

బోథ్: మండలంలోని సొనాల గ్రామ సమీపంలో గుర్రాలతండా గ్రామానికి వెళ్లే మిషన్ భగీరథ పైపులైన్ శనివారం లీకైంది. దీంతో నీరు వృథాగా ప్రవహిస్తుంది. వర్షం కురవడంతో లీకేజీకి మరమ్మతులు చేయడం సాధ్యం కాలేదని సిబ్బంది తెలిపారు. ఆదివారం మరమ్మతులు చేస్తామని పేర్కొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీరమా సత్యనారాయణ స్వామి దేవాలయం (మంగమఠం)లో పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఈ వ్రతంలో భక్తులు పాల్గొని, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు వైభవ్ దూబే మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

బోథ్: తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను సెక్రటేరియట్‌లోని ఆయన చాంబర్లో బోథ్ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించారు. సిరిసిల్ల రాజయ్యకు జిల్లాతో ఉన్న అనుబంధాన్ని, గత స్మృతులను, చేసిన అభివృద్ధి పనులను గుర్తుకు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ప్యాక్స్ డైరెక్టర్ గొర్ల రాజు యాదవ్, పసుల చంటి పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు పోటీలు

జైనథ్: స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో ప్రవేశాల కోసం ఈనెల 24న మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో గంగుల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రోడ్ జంప్, 6/10 మీటర్ల షటిల్ రన్, స్టాండింగ్ వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ, 1 కేజీ బాల్‌పుట్, 80 మీటర్స్ రన్నింగ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఆధార్‌కార్డ్ జిరాక్స్, బోనాఫైడ్ జిరాక్స్, రెండు పాస్ ఫొటోలు వెంట తీసుకొని రావాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎన్‌పీఎల్ నిర్వాహకులు



మెమొంటో అందజేస్తున్న నిర్వాహకులు

నేరడిగొండ: నేరడిగొండ ప్రీమియర్ లీగ్– 5 క్రికెట్ పోటీలు మండల కేంద్రంలో విజయవంతంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎన్‌పీఎల్ నిర్వాహకులు శనివారం మండల కేంద్రంలోని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో ఆయనను కలిసి మెమొంటో అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు జాదవ్ పవన్ కుమార్, యోగేశ్వర్, లఖన్, దినేష్, రవి, యశ్వంత్, రమేశ్, పాండు, అక్షయ్ పాల్గొన్నారు.

చదువుకున్న పాఠశాలకే ఉపాధ్యాయుడిగా..

జైనథ్: మండలంలోని లక్ష్మీపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు స్కూల్ అసిస్టెంట్‌గా దువాస రాజేశ్వర్ పదోన్నతిపై వచ్చారు. అయితే లక్ష్మీపూర్‌లో పుట్టి పెరిగిన రాజేశ్వర్ తన చిన్నతనంలో అదే పాఠశాలలో విద్యను అభ్యసించారు. తాను చదివిన పాఠశాలకు ఉపాధ్యాయడిగదా రావడం సంతోషంగా ఉందని రాజేశ్వర్ తెలిపారు.

రోడ్డు పక్కనే వ్యాపారం



జాతీయ రహదారి పక్కన కుప్పగా పోసిన కంకర

- ఇసుక, కంకర, ఇటుక విక్రయాలు
- అక్రమార్కులకు కాసులు.. ప్రజలకు తిప్పలు
- చోద్యం చూస్తున్న మున్సిపల్, ట్రాఫిక్ అధికారులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి అక్రమ దందాకు అడ్డగా మారుతోంది. కొంతమంది అక్రమార్కులు నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణ సామాగ్రిని రోడ్డుపైనే కుప్పలుగా పోసి విక్రయాలు సాగిస్తున్నారు. వారి వ్యాపారంతో సదరు వ్యక్తులు కాసులు గడిస్తుండగా పట్టణ ప్రజలు నడిచేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై పోసిన కుప్పల కారణంగా ప్రమాదాలు సైతం జరిగే అవకాశముంది. అయితే దీనిపై చర్యలు చేపట్టాల్సిన మున్సిపల్, ట్రాఫిక్ పోలీస్ యంత్రాంగం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. అధికారుల కళ్లెదుటే అక్రమ దందా సాగుతున్న పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

దర్జాగా వ్యాపారం

ఆదిలాబాద్ పట్టణం ఎన్టీఆర్‌చౌక్ సమీపంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్నటువంటి ఫుట్‌పాత్‌తో పాటు అంతర్గత రోడ్డును కొంతమంది వ్యాపారులు తమకు అడ్డగా మార్చుకున్నారు. అధికారికంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక, ఇటుక, కంకర విక్రయాలను సాగిస్తున్నారు. ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఈ భవన నిర్మాణ సామగ్రిని ఇతర ప్రాంతాల నుంచి తెప్పిస్తున్న వ్యాపారులు రోడ్డు పక్కనే కుప్పలుగా పోసి విక్రయాలు చేపడుతున్నారు. ఫుట్‌పాత్‌ను ఆక్రమించి సాగిస్తున్న ఈదందాతో వ్యాపారులు కాసులు గడిస్తుండగా నడిచేందుకు పాదచారులు స్థలం ఉండడం లేదు. లోడింగ్, అన్‌లోడింగ్ కోసం వాహనాలను సైతం రోడ్డుపైనే నిలుపుతున్నారు. ఫలితంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గత కొన్నేళ్లుగా ఈ అక్రమ దందా అధికారుల కళ్లెదుటే జరుగుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు.

గ్రీన్ బెల్టు ధ్వంసం

ఆదిలాబాద్ పట్టణంలో పచ్చదనం పెంపొందించాలనే ఉద్దేశ్యంతో ఎన్టీఆర్ చౌక్ నుంచి బసవేశ్వరచౌక్ వరకు గతంలో మున్సిపల్ అధికారులు రోడ్డుకు ఇరువైపులా గ్రీన్‌బెల్టు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. హరితహారంలో భాగంగా పలు విడతల్లో మొక్కలు నాటడంతో పాటు వాటి రక్షణ కోసం ప్రత్యేకంగా పెన్సింగ్ వేశారు. కానీ సదరు వ్యాపారులు పెన్సింగ్‌ను పూర్తిగా తొలగించి వేశారు. నాటిన మొక్కలైతే కనిపించకుండా పోయాయి. ఫలితంగా కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా కావడంతో పాటు ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అటు బస్టాండ్ సమీపంలోనూ ప్రైవేట్ ట్యాక్సీ వాహనాల అడ్డగా ఏర్పాటు చేసిన వాహనదారులు అక్కడ కూడా పెన్సింగ్‌ను తొలగించి వేయడంతో మొక్కలు తీసివేశారు. పట్టణంలో బస్టాండ్ నుంచి తిర్పెల్లి వరకు జాతీయ రహదారిపై ఇదే పరిస్థితి ఉండటంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యథేచ్ఛగా మొరం తవ్వకాలు



మొరం తవ్వకాలతో ఏర్పడిన గుంత

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా మొరం తవ్వకాలు సాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న మొరం తవ్వకాలను అరికట్టాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని రామాయి, అడ్డగుట్ట గ్రామాల మధ్యలో గల పీపీ ల్యాండ్‌లో ఉన్న చెట్లను తొలగించి గత కొద్ది రోజులుగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. ఈవిషయంపై 'సాక్షి' ఆదిలాబాద్ రూరల్ తహసీల్దార్ దిలీప్ కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా మొరం తవ్వకాలను అరికట్టాల్సిన బాధ్యత మైనింగ్ అధికారులదేనన్నారు. అటవీశాఖ అధికారిని అరుణను సంప్రదించగా అక్కడ జరుగుతున్న మొరం తవ్వకాలతో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇలా ఒకరిపై ఒకరు మా బాధ్యత కాదంటూ.. చెప్పడంతో వ్యాపారులు అందినకాడికి తవ్వకాలు చేపడుతూ.. చేతినిండా సంపాదిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మొరం తవ్వకాలను అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కల్యాణలక్ష్మి పేదలకు వరం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరంలాంటిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం నేరడిగొండలోని ఆయన నివాసం వద్ద 53 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, తులం బంగారం ఇస్తామన్న హామీని అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, తహసీల్దార్ సంతోష్ రెడ్డి, వడూర్ ఎంపీటీసీ అంబేకర్ పండరి, వీడీసీ అధ్యక్షుడు ఏలేటి రవీందర్ రెడ్డి, నేరడిగొండ పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్ సింగ్, గులాబ్ సింగ్, రాథోడ్ సురేందర్ పాల్గొన్నారు.

అమ్మా.. బస్సులో ప్రయాణం బాగుందా?

గుడిహత్నూర్: అమ్మా.. బస్సులో ఉచిత ప్రయాణం బాగుందా.. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అంటూ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆర్టీసీ బస్సు ఎక్కి ప్రయాణికులతో ముచ్చటించారు. తన పర్యటనలో భాగంగా వెళ్తుండగా స్థానిక బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సులోకి ఎక్కి ప్రయాణికులతో మాట్లాడారు. ప్రయాణంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. సీట్లు దొరకడం లేదంటూ.. మహిళలు చెప్పగా.. దీనిపై ప్రభుత్వానికి నివేదించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రైతులపై అటవీ అధికారుల పెత్తనం ఏంటి?

- అధికారుల తీరుపై జెడ్పీ చైర్మన్ ఆగ్రహం
- వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్: గత 70 ఏళ్ల నుంచి ఏజెన్సీ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న భూములపై అటవీశాఖ అధికారుల పెత్తనం ఏంటని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కనక మోతిబాయి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాగల్‌కొండ గ్రామ శివారులో ఉన్న 67 సర్వే నెంబర్ గల భూమిలో దాదాపు 3 వేలకు పైగా ప్రభుత్వ భూమి ఉందని తహసీల్దార్ జాడి రాజలింగు తెలిపారు. అందులో 60 ఏళ్లుగా కొంతమంది సాగు చేసుకుంటున్నారని వివరించారు. అటవీశాఖ అధికారులు ఫారెస్ట్ భూమి అంటూ రైతులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వ భూమి అని రెవెన్యూ రికార్డులు చెబుతున్నప్పటికీ అటవీ అధికారులు పట్టించుకోవడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే చైర్మన్ జోక్యం చేసుకొని ఏజెన్సీ ప్రాంతంలో రైతులు సాగుచేసే భూమి విషయంలో అటవీ అధికారులు రైతులను ఇబ్బంది పెట్టవద్దన్నారు. అన్నిశాఖల అధికారులు సమయపాలన పాటించడం లేదని, సభ్యులు ఆరోపించారు. అధికారులు అంకితభావం, బాధ్యతతో పనిచేయాలని సూచించారు. గిరిజన గ్రామాలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు వివరించాలని ఐటీడీఏ ఏఈ సునీల్ రాథోడ్‌ను కోరారు. సమావేశంలో ఎంపీపీ కనక మోతిబాయి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, పీఏసీఎస్ చైర్మన్ ఆడే సురేశ్, ఎంపీడీవో జవహర్, ఐటీడీఏ డీఈ శివప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ కాలనీలో శుక్రవారం రాత్రి ఇంటి పైకప్పు కూలి మృతి చెందిన ఉషా పాండే కుటుంబాన్ని ఎమ్మెల్యే పాయల్ శంకర్ శనివారం పరామర్శించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ప్రమాదం జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ తోడ్పాటు అందేలా కృషి చేస్తామని భరోసానిచ్చారు. ఎమ్మెల్యేతో బీజేపీ పట్టణ అధ్యక్షుడు లాలామున్నా, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాలను శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. మండలంలోని సావర్గాం మాజీ సర్పంచ్ తండ్రి ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి పరామర్శించారు. అర్లి(టి)లో మాజీ ఎంపీటీసీ గోల్లి రామయ్య శుక్రవారం మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని సైతం పరామర్శించి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

ఎదులాపురం: మున్సిపల్ జవాన్ నర్సింలు శుక్రవారం గుండెపోటుతో మృతి చెందగా.. ఆయన కుటుంబాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. నర్సింలు గుండెపోటుతో మృతి చెందడం బాధకరమన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కొనసాగుతున్న హనుమాన్ చాలీసా పారాయణం



రామాలయంలో హనుమాన్‌చాలీసా పారాయణం

బోథ్: సొనాల గ్రామంలోని రామాలయంలో ప్రతీ శనివారం జరిగే సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం కొనసాగుతోంది. శనివారానికి 27 వారాలు పూర్తియింది. హనుమాన్ చాలీసా పారాయణంలో చిన్నారులు, పిల్లలు పాల్గొన్నారు. పారాయణంతో ప్రజల్లో భక్తిభావం పెరుగుతుందన్నారు.

నాణ్యమైన టైర్లను వినియోగించాలి



షోరూంను ప్రారంభిస్తున్న ఎంఆర్‌ఎఫ్ డీఎం రవికిరణ్

ఆదిలాబాద్‌టౌన్: వాహనదారులు నాణ్యమైన ఎంఆర్‌ఎఫ్ టైర్లను వినియోగించాలని ఆ సంస్థ డీఎం రవికిరణ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో అన్నపూర్ణ టైర్స్ ఎక్స్‌క్లూజీవ్ షోరూంను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పట్టణంలో నూతనంగా షోరూం ప్రారంభించడం జరిగిందన్నారు. త్వరలో వీల్ అలైన్‌మెంట్, బ్యాలెన్స్, తదితర సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్వీస్ ఇంజనీర్ సాయికిరణ్, షోరూం యజమాని వెంకట్ రెడ్డి, మదన్ గోపాల్, మోహన్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ముట్టడిని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కనక ప్రభాకర్

నార్నూర్: మెగా డీఎస్సీ నిర్వహించి, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఐటీడీఏ బ్యాక్‌లాగ్ పోస్టులనుభర్తీ చేయాలని ఈనెల 24న తుడుందెబ్బ ఆధ్వర్యంలో తలపెట్టిన ఐటీడీఏ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని కుమురం భీం భవన్ వద్ద మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. జీవో 3తో పాటు ఏజెన్సీ ప్రాంతంలో పోడు భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలివ్వాలన్నారు. ఉద్యోగస్తులు, విద్యార్థులు, యువతీ, యువకులు, ఉపాధ్యాయ కార్మిక కర్షక మేధావులు, కవులు, కళాకారులు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఆదివాసీ గిరిజనులు వారి హక్కుల కోసం పోరాటం చేసే సమయం ఆసన్నమైందన్నారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు మాడవి మాన్కు, జిల్లా నాయకుడు మెస్రం మాణిక్ రావు, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ ప్రకటనపై కాంగ్రెస్ నాయకుల హర్షం



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు

కైలాస్‌నగర్: రైతులకు ఏకకాలంలోనే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని ప్రజాసేవ భవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పాలన సాగిస్తోందన్నారు. ఇప్పటికే గ్యారంటీ హామీలను అమలు చేస్తుందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండు దఫాల్లో రుణమాఫీ చేస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేశ్, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, ఆవుల వెంకన్న, సంద నర్సింగ్, లోక ప్రవీణ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చరణ్ గౌడ్, సామ రూపేష్ రెడ్డి, బండి దేవిదాస్ చారి పాల్గొన్నారు.

ఎదులాపురం: గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం ఏర్పాటైన 7 నెలల్లోనే ఏక కాలంలో రూ.31 వేల కోట్లతో రుణమాఫీకి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. దాదాపు 47 లక్షల మంది అన్నదాతలకు లబ్ధి చేకూరనుందని అన్నారు. కాంగ్రెస్ రైతు ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం అని చెప్పడానికి ఇదే నిదర్శనమన్నారు. బూర్గుల మల్లేష్, తడిసెన వెంకట్ రెడ్డి, ధర్మపురి చంద్రశేఖర్, వేముల నాగరాజు, రాజేశ్వర్ యాదవ్, రహీమ్ ఖాన్, నలిమేల నవీన్ రెడ్డి, రంజిత్ రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి



అవగాహన కల్పిస్తున్న డీడబ్ల్యూవో సబిత

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు అన్నిరంగా ల్లో ముందుండాలని జిల్లా సంక్షేమ అధి కారి సబిత అన్నారు. మహిళా, శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 'సంకల్ప్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ 100–డేస్ స్పెషల్ అవేర్‌నెస్ క్యాంపెయిన్'ను జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ఈనెల 24 నుంచి అక్టోబర్ 4 వరకు వంద రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఇందులో భాగంగా మిషన్ శక్తి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని జైనథ్ ప్రాజెక్టుకు సంబంధించిన అంగన్‌వాడీ టీచర్లకు వివరించారు. టోల్‌ఫ్రీ నంబర్లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మిషన్ శక్తి పథకం, బేటీ డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ యశోద మాట్లాడుతూ బేటీ బచావో.. బేటి పడావో పథకం, మహిళా సాధికారత అంశాలను వివరించారు. సీడీపీవో నర్సమ్మ, సూపర్‌వైజర్లు, జిల్లా మహిళా సాధికారత సిబ్బంది కృష్ణవేణి, కోటేశ్వర, నిక్లేశ్వర్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పోడు భూముల సమస్య పరిష్కరించండి



సుగుణను కలిసిన కౌఠ గ్రామస్తులు

బోథ్: పోడు భూముల సమస్య పరిష్కరించాలని బోథ్ మండలంలోని కౌఠ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణను శనివారం కలిసి విన్నవించారు. విత్తనాలు వేయాలంటేనే భయం వేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోడు రైతుల పక్షాన నిలబడతానని, జిల్లా అటవీ శాఖ అధికారులతో మాట్లాడతానని ఆమె భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు గాజుల సురేందర్, సున్నపు శ్రీనివాస్, పాలేపు గణేష్, నాయకులు పాల్గొన్నారు.

చిటపట చినుకులు..

ఆదిలాబాద్ జిల్లాలో గత మూడు రోజులుగా మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి పాఠశాలల విద్యార్థులతో పాటు కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లే ఉద్యోగులు తడుస్తూ.. వెళ్లారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్







వృక్షశాస్త్ర విభాగ అధిపతిగా కనుగుట్ట వాసి



బాధ్యతలు తీసుకుంటున్న ప్రొఫెసర్ వెంకట రమణ

బోథ్: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ అనుబంధ కళాశాల అయిన యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్, సైఫాబాద్‌లోలో వృక్షశాస్త్ర విభాగ అధిపతిగా బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన వెంకట రమరణ బాధ్యతలు స్వీకరించారు. కాగా మారుమూల ప్రాంతం నుంచి వెంకట రమణ వృక్షశాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్శిటీ అనుబంధ కళాశాల అయిన యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో వృక్షశాస్త్ర విభాగ అధిపతిగా నియమితులైన సందర్భంగా గ్రామస్తులు, మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.